చల్లగ చూడు దుర్గమ్మా



విమాన్‌నగర్‌లో అమ్మవారి విగ్రహం ముందు దీపాలంకరణ

విశాఖ విద్య: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. దుర్గాష్టమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల వద్ద దసరా శోభ కనిపిస్తోంది. భవానీ మాలధారణ చేసిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలను దర్శించుకొని అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

- 90వ వార్డు గవరవీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారిని వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పాలమరెట్టి కోటి తదితరులు పాల్గొన్నారు.
- 90వ వార్డు విమాన్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారిని విశేషంగా అలంకరించారు. భక్తులు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి నాగు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసంతర్పణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
- బుచ్చిరాజుపాలెం శ్రీ దుర్గాలమ్మ- శ్రీ బంగారమ్మ ఆలయంలో శాస్త్రోక్తంగా కలశ పూజ జరిగింది. అమ్మవార్లు శనివారం దుర్గాదేవి అవతావరంలో భక్తులకు దర్శనమిచ్చారు. కమిటీ సభ్యులు బుజ్జి, జగన్, సతీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- 52వ వార్డు అంబేద్కర్ కాలనీ, కరాస, మర్రిపాలెం ఉడా కాలనీ తదితర చోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దుర్గాదేవి అవతారంలో దుర్గమ్మతల్లి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవ వీధిలో డేరింగ్ అండ్ డ్యాషింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ఇదే ప్రాంతంలో మార్కెట్ వీధి వద్ద శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి పూజలు ఆదివారం నుంచి మొదలు పెట్టారు.

- రజక వీధి వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.గాజువాక ఆర్టీసీ డిపో వద్ద, జనతాకాలనీ జైదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పలు చోట్ల దీపారాధన నిర్వహించారు.

భారీ అన్నసమారాధన

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో, అల్లూరిసీతారామరాజుకాలనీలో నవదుర్గాయూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని పారిశ్రామిక వేత్త మజ్జి మాలినాయుడు ప్రారంభించారు.

- జీవీఎంసీ 40 వార్డు పరిధి ఏకేసీకాలనీ రేకుల షెడ్డు వద్ద నెలకొల్పిన అమ్మవారిని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు దర్శించుకుని అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో బంటు రామానాయుడు, శరగడం హరీష్, మునస ప్రసాద్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



90వ వార్డు గవరవీధిలో అమ్మవారి పూజల్లో కార్పొరేటర్ రమణ



శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో..



అన్న ప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవిని భక్తులు వెండి పుష్పాలతో అర్చించారు. గొల్లకంచరపాలెం శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకుడు వీవీఎల్ సుబ్రహ్మణ్యశర్మ సామూహిక కుంకుమ పూజలు, దుర్గాదేవి వ్రతం నిర్వహించారు. సోమవారం చండీ యాగం, 30 సోమవారం మధ్యాహ్నం మహా అన్నదానం ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు యలమంచిలి వెంకటరావు, పాత్రపిల్లి వెంకటరమణ, పల్లా పెంటారావు, సానబోయిన సంపత్‌కుమార్, నక్కా శంకరరావు, కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

అంతా సుఖ సంతోషాలతో ఉండాలి

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



విశాఖ విద్య: దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. దసరా పర్వదినం పురస్కరించుకొని నగర వాసులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దుర్గమ్మ ఆశీస్సులతో చేపట్టిన పనులు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ సహకారంతో భవిష్యత్‌లో విశాఖ నగరం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చిత్రలేఖనాన్ని ఆదరించాలి

మల్కాపురం: ప్రముఖ చిత్రకారుడు డి.ఎస్.మనోహర్ సంపాదకత్వంలో రూపొందించిన చిత్రలేఖనం మాస పత్రికను మల్కాపురం శాఖ గ్రంథాలయంలో ఆదివారం శిల్పి,చిత్రకారుడు టి.ప్రభాకరాచారి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నానాటికీ ఆదరణ కోల్పోతున్న చిత్రకళారంగానికి ఈ పత్రిక ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. చిత్రకళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు జి.కె.వి.రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయిత సుంకర చలపతిరావు, సి.ఎస్.రాజు,శివ,బాలు,బుజ్జి, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



మెమెంటో అందుకుంటున్న విద్యార్థి

విశాఖ విద్య: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయిలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో డెల్టాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఇండియా బేబీ ఒలింపిక్ గేమ్స్‌లో ఎస్ఎడీ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ నివేదిత తెలిపారు. రన్నింగ్, రింగ్ హోల్డింగ్‌లో బి. లవిష్ కార్తికేయ, ఎం. ధృవ సత్తా చాటారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు ప్రోత్సహించిన పీఈటీ పీ. శ్రావణిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

'ఆత్మగౌరవానికి ప్రతీక విశాఖ ఉక్కు'

కూర్మన్నపాలెం: దేశ ప్రజల ఆత్మ గౌరవానికి నిదర్శనమైన విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 983వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం సీఐ ఎస్. విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మళ్లీ ఎటువంటి నేరాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులతో హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు పోలీసు నిఘా ఉంటుందన్నారు. పలు హత్య కేసుల్లో ఉన్న నిందితులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వేలిముద్రలు సేకరించారు.

- ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్లర్లకు పాల్పడవద్దని హెచ్చరించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇంటి వద్ద అప్పగించారు.

అట్టహాసంగా దసరా సంబరాలు



మహిళలకు దసరా కానుకలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్‌కుమార్



సంబరాలకు హాజరైన మహిళలు



అలరించిన చిన్నారుల నృత్య రూపకం

గోపాలపట్నం: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఆదివారం దసరా సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సంబరాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడింది. అనంతరం మహిళలకు దసరా కానుకలు పంపిణీ చేశారు.

కిటకిటలాడిన సభా ప్రాంగణం

ఉదయం 10.30 గంటలకే సభా ప్రాంగణం కిటకిటలాడింది.నియోజకవర్గంలో మహిళలు, పార్టీ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. దీంతో ఉన్నత పాఠశాల ప్రాంగణం కిటకిటలాడింది. నియోజకవర్గంలో వార్డుల వారీగా ఏర్పాటు చేసిన బ్లాకులన్నీ నిండిపోయాయి. సభకు వచ్చిన వారికి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో భాగంగా పలువురు కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు, మిమిక్రీ, జానపద పాటలు అలరించాయి. ఉత్సవాలకు హాజరైన వారు కూడా ఉత్సాహంతో స్టెప్‌లు వేశారు.

కల్వర్ట్‌లో దూసుకుపోయిన ఆటో : డ్రైవర్ మృతి



మృతుడు ఆదినారాయణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్ -7 కూడలి వద్ద కల్వర్ట్‌లోకి ఆటో దూసుకుపోయిన సంఘటనలో డ్రైవర్ మృతి చెందగా..మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. పెందుర్తి సమీప పెదగాడికి చెందిన పసల ఆదినారాయణ (48) ఆటోలో రోజూ స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని రైతు బజార్‌కు సరకులు రవాణా చేస్తుంటాడు. ఆదివారం ఉదయం కూడా రైతు బజారుకు సరకులు తెచ్చాడు. తిరిగి వెళ్తూ ఓ ప్రయాణికుడ్ని ఎక్కించుకున్నాడు. సెక్టార్-7 కూడలి వద్దకు వచ్చే సరికి ఆటో అదుపు తప్పి రోడ్డు పక్క ఉన్న కల్వర్ట్‌లోకి దూసుకుపోయింది. దీంతో డ్రైవర్ ఆదినారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ ఎస్ఐ మహాలక్ష్మి ఆటోను బయటకు తీయించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. స్టీల్‌ప్లాంట్ ఎస్ఐ స్వామినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

గోపాలపట్నం: జాతీయ రహదారిలో ఎన్ఎస్‌టీఎల్ గేటు వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం 3 గంటల సమయంలో ఎన్ఏడీ నుంచి ఆర్ అండ్‌బీ జంక్షన్‌కు వెళ్లే దారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో వచ్చిన 108 వాహనం సిబ్బంది పరీక్షించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటుంది. గళ్ల షర్టు, నలుపు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.

కొమరం భీమ్‌కు ఘన నివాళి



కొమరం భీమ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జిల్లా మహాబోధి సొసైటీ సభ్యులు

పెదగంట్యాడ: గిరిజనోద్యమ నాయకుడు కొమరం భీమ్ సేవలు మరువలేమని జిల్లా మహాబోధి సొసైటీ సభ్యుడు బోర వేణుగోపాల్ గౌతమ్ అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పెదగంట్యాడ కూడలిలో కొమరం భీమ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ విముక్తి కోసం నిజాం నవాబుపై గెరిల్లా పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాటాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో టేకేటి పెంటయ్య, మార్పుపూడి పరదేశి, గంట్యాడ గోవిందరావు, ములకలపల్లి చిన్నారావు, కె.అన్నవరం పి సిద్దార్థ, గంట్యాడ పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన వివాహిత కోరుపోలు శ్రీలక్ష్మి (29) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. గోపాలపట్నం ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భర్త కరుపోలు అప్పలనాయుడు తన కుమార్తెకు సైకిల్ నేర్పించేందుకు బయటకు తీసుకువెళ్లాడు. భర్త వెళ్లిన తరువాత ఇంట్లో దూలానికి చీర కట్టుకుని ఉరి వేసుకుని మృతి చెందింది. భర్త తిరిగి వచ్చే సరికి తలుపులు కొట్టగా ఎంతకూ తీయకపోవడంతో కిటికిలోనుంచి చూసే సరికి ఉరి వేసుకుని కనిపించింది. దీంతో స్థానికులతో కలిసి శ్రీలక్ష్మిని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అప్పల నాయుడు, శ్రీలక్ష్మి 12 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరి మధ్య మనస్పర్థలున్నాయని ప్రాథమిక సమాచారం. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త జీవీఎంసీలో చెత్త తరలించే వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న గోపాలపట్నం పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింహాచలేశుడికి వైభవంగా ఆర్జిత సేవలు



మాంగల్య ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అదిష్టింపజేసి108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై అదిష్టింపజేసి అష్టోత్త శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

వైభవుని సన్నిధిలో ధర్మ ప్రచారోత్సవాలు ప్రారంభం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా సందర్భంగా ధర్మ ప్రచారోత్సవాలు ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకుడు శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి అమ్మవారికి కేకే రాజు కుంకుమ సమర్పించారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం కలశస్థాపన, సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు మధుమోహన్, బంగారాజు, విశ్వస్వరూప్, సురేష్, పరశురాములు. శ్రీరాములు, ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు రామచంద్రరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సాధు శతకం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

సీతంపేట: పి.ఎల్.వి.ప్రసాద్ రచించిన 'సాధు శతకం'పుస్తకావిష్కరణ సభ అమరావతి విశ్వసాహితి ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. ప్రముఖ పద్య కవి సిహెచ్.చినసూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూలికుప్పల మాట్లాడుతూ సరళంగా ప్రసాద్ రాసిన రచనా శైలిని అభినందించారు. పుస్తక సమీక్ష చేసిన డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ ప్రసాద్ శతక పద్యాల వైశిష్ట్యాన్ని సభకు వివరించారు.